వరద వెతలు..


బొక్కలగడ్డలో చెత్త తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

దయనీయంగా ముంపు ప్రాంతాలు

- వర్ణనాతీతంగా వరద బాధితుల స్థితి
- తింటానికి తిండిగింజలు లేని వైనం
- ఎవరిని కదిలించినా కన్నీళ్లే..
- తమను ఎవరు ఆదుకుంటారని ఆవేదన
- పాములు, తేళ్లతో సహవాసం

ఖమ్మంవైద్యవిభాగం, ఖమ్మంక్రైం, ఖమ్మం స్పోర్ట్స్: మున్నేటి వరద తాకిడికి ముంపునకు గురైన పరీవాహక ప్రాంతాలైన బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మంచికంటినగర్, పద్మావతినగర్, మోతెనగర్, పంపింగ్‌వెల్ రోడ్‌లోని పెద్దమ్మతల్లి గుడి ప్రాంతం, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో వరద బాధితుల పరిస్థితి చూస్తే ఎంతో భయంకరంగా, దయనీయంగా ఉంది. సర్వం కోల్పోయి, గత మూడు రోజులుగా విద్యుత్ సౌకర్యం లేక, అంధకారంలో మగ్గుతూ, పాములు, తేళ్ల వంటి విష కీటకాలతో సహవాసం చేస్తున్నారు. బిక్కుబిక్కు మంటూ ఎవరో వస్తారని, తమని ఆదుకుంటారని చేతులెత్తి సహాయాన్ని అర్థిస్తూ, రోధిస్తున్న తీరు చూస్తే ఎవరికైనా కన్నీళ్లు ఆగవు. తిండిగింజలు కూడా నేలపాలు కావడంతో తమ పరిస్థితిని తలచుకొని వారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. మంగళవారం సాక్షి దినపత్రిక బృందం ముంపు ప్రాంతాల్లో పర్యటించగా.. వారి దమనీయ పరిస్థితి ఇలా ఉంది.


సాయిగణేష్‌నగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు


బురదమయమైన సామన్లను తీసుకెళ్తున్న దృశ్యం

సర్వం కోల్పోయి..


ఇంటి ముందు కూతురు, మనుమరాళ్లతో దీనస్థితిలో ఉన్న రాంశెట్టి నాగమణి

వరద తాకిడికి ఇల్లు నేలమట్టం కావడంతో పాటు దుస్తులు, ఇంట్లోని సామన్లు కొట్టుకుపోవడంతో రాంశెట్టి నాగమణి అనే మహిళ తన కూతురు, ఇద్దరు మనవరాళ్లతో ఇంటి బయటే రోదిస్తూ ఉంది. వచ్చి పోయే అధికారుల వద్ద తన పరిస్థితిని చెబుతూ రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటుంది.

విషకీటకాలతో సహవాసం..


రక్షణ కల్పించాలని వేడుకుంటున్న ఫాతిమ

మున్నేరు వరద తాకిడితో గత మూడు రోజులుగా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో పాటు సర్వం కోల్పోయి గత మూడు రోజులుగా వరదలో కొట్టుకొచ్చిన పాములు, తేళ్లకు వరద బాధితుల ఇళ్లు ఆవాసాలుగా మారాయి. దీంతో విష కీటకాల నుంచి తమను తాము కాపాడుకుంటూ ఇంటిని శుభ్రం చేసుకుంటున్నారు. దీనికి తోడు జోరు వర్షానికి విష జ్వరాలు సైతం సంభవిస్తుండడంతో అక్కడి వారు భయంతో వణికిపోతున్నారు. తమకు రక్షణ కల్పించాలని ఫాతిమ అనే మహిళతో పాటు అక్కడి వారు వేడుకుంటున్నారు.

వృద్ధాప్యంలో ఎంత కష్టం..


చేతులు జోడించి వేడుకుంటున్న బాలమ్మ

బొక్కలగడ్డలోని మున్నేటి పక్కన ఉన్న ప్రాంతంలో ఉమ్మనేని బాలమ్మ అనే వృద్ధురాలు వరద తాకిడికి తన ఇల్లుతో పాటు బట్టలు, సామన్లు పూర్తిగా కోల్పోయి ఖాళీ స్థలంలో నిలబడి ఆ ప్రాంతానికి వస్తున్న ప్రతీ ఒక్కరిని చేతులు జోడించి తనను ఆదుకోవాలని రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. తనను చూసుకోవటానికి కూడా ఎవరూ లేరని, వర్షం వస్తే తాను ఎక్కడ ఉండాలో తెలియక, ఆకలేస్తే అన్నం పెట్టేవారు లేక అందరినీ అడుగుతూ రోదిస్తోంది.

కట్టుబట్టలే మిగిలాయి..


కట్టుబట్టలతో రాము కుటుంబ సభ్యులు

ఒక్కసారిగా మున్నేరు పొంగడంతో బొక్కలగడ్డ ప్రాంతంలో కూలిపని చేసుకుంటూ నివాసం ఉంటున్న రాము, అతడి కుటుంబసభ్యులు వారి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని మూడు రోజుల క్రితం పునరావాస కేంద్రానికి వెళ్లారు. ఇంటి సామగ్రి, బట్టలు కోల్పోవడంతో పాటు ఇంటి పైకప్పు కూడా వరద తాకిడికి కొట్టుకుపోవడంతో రోడ్డుపై నిలబడి రోదిస్తూ తమను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

క్లుప్తంగా

ముంపు నష్టం సర్వే షురూ..

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద ప్రాంతాల్లో నష్ట అంచనాపై అధికారులు సర్వే ప్రారంభించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో వరద తాకిడికి గురైన 13 డివిజన్లలో సర్వే చేసేందుకు వివిధ శాఖలకు చెందిన 112 మంది సిబ్బందితో 14 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో 8 మంది సభ్యులను ఏర్పాటు చేశారు. 12 కాలమ్స్‌తో కూడిన ఒక ఫామ్‌ను సిద్ధం చేసి సర్వే బృందాల సభ్యులకు అధికారులు అందజేశారు. మంగళవారం నుండే ఈ సర్వేను ప్రారంభించారు. వరద ప్రాంతాల్లోని ప్రతీ ఇంటిని ఈ బృందం సందర్శించి రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

సేకరించాల్సిన వివరాలు..

సర్వే ఫామ్‌లో వరద ప్రాంతం పేరు/లోకేషన్, కుటుంబ యజమాని పేరు, వారి నాన్న/భర్త పేరు, ఇంటి నంబర్, ఫోన్ నంబర్, రెంట్/సొంత ఇళ్లు, నష్టం వివరాలు (1.ఇంటి చుట్టూ నీళ్లు చేరాయా, 2. కాంపౌండ్ వాల్‌లోకి వరద నీళ్లు వచ్చాయా, 3.ఇంటి గదుల్లోకి నీళ్లు చేరాయా, 4. వరదతో ఇంటికి భారీ నష్టం జరిగిందా, 5. ఇంటి నష్టం), ఫొటో, బ్యాంక్ అకౌంట్ నంబర్, వంటి వివరాలను ఈ సర్వే బృందం వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితుల నుంచి సేకరిస్తున్నారు.

కూలిన కళాశాల ప్రహరీ..


కూలిన ప్రభుత్వ కళాశాల ప్రహరీ

ఖమ్మం సహకారనగర్: గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలు, వరదల నేపథ్యాన నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ కూలింది. కళాశాల ఆవరణ, తరగతి గదుల్లోకి వరద నీరు చేరడంతో పాటు సామగ్రి అంతా పాడయింది. బుధవారం కళాశాల తెరిచే అవకాశం లేకపోవడంతో తరగతులను రద్దు చేసినట్లు ప్రిన్సిపాల్ కెఎస్.రామారావు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేసినట్లు చెప్పారు.

దంపతులకు గాయాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బోనకల్ రోడ్డు ధంసలాపురం వద్ద మున్నేరు వరదతో రోడ్డుపైకి చేరిన బురదలో జారిపడడంతో దంపతులకు గాయాలయ్యాయి. చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన గుర్రం నాగేశ్వరరావు – వసంత దంపతులు ఖమ్మంలో సుతారీ పనులకు వచ్చి వెళ్తుంటారు. సోమవారం రాత్రి వెళ్తుండగా ధంసలాపురం వద్ద బురదలో వారి బైక్ జారి పడింది. ఈ ఘటనలో దంపతులు గాయపడగా ఆస్పత్రికి తరలించారు.

టపాసు పేలి చిన్నారికి..

నేలకొండపల్లి: నేలకొండపల్లికి చెందిన నిహార్ అనే చిన్నారి మంగళవారం స్నేహితులతో కలిసి ఇంటి డాబాపై టపాసులు (చిచ్చుబుడ్డి) కాలుస్తున్నాడు. ఈక్రమంలో అది పేలకపోవడంతో దగ్గరకు వెళ్లి చూసేసరికి ఒక్కసారిగా పేలడంతో చిన్నారికి గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై ఖమ్మంకు తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ..

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఓ బైక్ చోరీకి గురైంది. స్థానిక పసుపులేటి రమేష్ తన ఉంటున్న ఇంటి ముందు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. మంగళవారం ఉదయంకల్లా లేకపోవడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: గత నాలుగు రోజుల క్రితం ఖమ్మం జీఆర్‌పీ పోలీస్‌ల పరిధిలోని వాణి ఐటీఐ ఎదురుగా రైలు పట్టాల వద్ద ఓ గుర్తు తెలియని 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందగా రైల్వే పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఇప్పటివరకు ఎవరూ రాకపోవడంతో జీఆర్‌పీ ఎస్సై పారుపల్లి భాస్కరరావు సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన బల్లేపల్లి వైకుంఠధామంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా ఎదుట ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని 25వ డివిజన్ హరిజనవాడలో ఉన్న బస్తీ దవాఖానా ఎదుట మంగళవారం వైద్య చికిత్సల కోసం వచ్చిన బాధితులు ఆందోళనకు దిగారు. జ్వరాలతో ఉన్న బాధితులకు బస్తీ దవాఖానాలో మందులు అందడం లేదని, షుగర్, బీపీ తదితర వ్యాధులకు సంబంధించిన మందులను ప్రభుత్వం సరఫరా చేయకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే రూ.వేలు ఖర్చవుతున్నాయని, బస్తీ దవాఖానాకు వస్తే మందులు ఇవ్వడం లేదని వాపోయారు.

పౌష్టికాహారంతో బాల్యానికి రక్షణ

నేలకొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం బాల్యానికిరక్షణగా నిలుస్తుందని తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ బి.సరస్వతి పేర్కొన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని రాజేశ్వరపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు కె.లక్ష్మీకుమారి, పి.నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం విజయనిర్మల, ఆశా కార్యకర్తలు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో రాష్ట్రస్థాయి అధికారులు

ఖమ్మం సహకారనగర్: నగరంలో వరద సహాయక చర్యలు ముమ్మరం చేసేందుకు రాష్ట్రస్థాయి అధికారులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచే (సీడీఎంఏ) కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వీపీ గౌతమ్, మంగళవారం ఉదయం నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌లు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పలు ప్రాంతాలను సందర్శించారు. అదే విధంగా ఆయా అధికారులు, సిబ్బందితో సమావేశాలను నిర్వహిస్తూ సహాయక చర్యల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న వివరాలను సేకరిస్తూ సహాయక చర్యల్లో ముందుంటున్నారు.

కవిరాజ్‌నగర్‌లో కమిషనర్ పర్యటన..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌లో బుధవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్త తొలిగింపు పనులు, బాధితులకు ప్రభుత్వం ద్వారా అందించే కిట్ల పంపిణీ తీరు తదితర వాటిపై ఆరా తీశారు.

రహదారికి మరమ్మతులు

కూసుమంచి: మండలంలోని పాలేరు–బంగ్లా రహదారి పాలేరు వరద ఉధృతికి నానుతండా వద్ద కొట్టుకుపోగా మంగళవారం అట్టి రహదారికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. కాగా, ఈ ప్రాంతాన్ని మంత్రి సోదరుడు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

అలుగు వెడల్పు పనులు ప్రారంభం

ఖమ్మంఅర్బన్: నగరంలోని కవిరాజ్‌నగర్ రోడ్డు నంబర్ 12 సరిహద్దు నుంచి లకారం ట్యాంక్‌బండ్‌లోని రెండు చెరువులకు మధ్యలో ఉన్న వాగును శుభ్రం చేసే ప్రక్రియను ప్రారంభించారు. గతంలో ఉన్న సుమారు 15 అడుగుల సీసీ వాల్ వాగుకు అదనంగా పైభాగంలో మరో 15 అడుగులు వాగు ఉండేలా మంగళవారం జేసీబీల ద్వారా పనులు చేస్తున్నారు.

వరద బాధితులకు చేయూత


దుప్పట్లు అందిస్తున్న యూబీఐ హెడ్ హన్మంతరెడ్డి, తదితరులు


బియ్యం అందిస్తున్న రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు


బొక్కలగడ్డలో తాగునీరు సరఫరా చేస్తున్న ఎస్‌బీఐ అధికారులు, ఉద్యోగులు


సాయి న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యాన..

జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో నిరాశ్రయులైన కుటుంబాలకు పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యాన మంగళవారం సహాయక చర్యలు చేపట్టారు.

- **ఖమ్మం సహకారనగర్:** రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మ రాజేశ్వరరావు, జవ్వాజి నగేష్‌లు రూ.5 లక్షల విలువ చేసే 100 క్వింటాళ్ల బియ్యాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు నగేష్, మధు, అర్జున్‌రావు, అచ్యుతరావు, గణపతిరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన 200 మంది వరద బాధితులకు కుటుంబానికి రూ.వెయ్యి విలువ చేసే నిత్యావసర వస్తువులను అందించినట్లు ఫౌండేషన్ చైర్మన్ వెనిగళ్ల రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, మాదినేని నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మంఅర్బన్:** నగరంలోని 11 డివిజన్ కవిరాజ్ నగర్, వరదయ్యనగర్ వీధుల్లో కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులతో కార్పొరేటర్ సరిపుడి రమాసతీష్‌లు శుభ్రం చేయిస్తూ చెత్తను తరలించే పనిలో ఉన్నారు. అలాగే ప్రభుత్వం అందించిన నిత్యావసర కిట్లను కార్పొరేటర్, కార్పొరేషన్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పేర్లు నమోదు చేసుకుంటూ కిట్లు అందిస్తున్నారు.
- **ఖమ్మం మామిళ్లగూడెం:** నగరంలోని 16వ డివిజన్ ధంసలాపురం కాలనీలో బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు సహకారంతో భోజనం పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వీరభద్రప్రసాద్, మందడపు సత్యనారాయణ, రుద్రప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యాన దుప్పట్లు, చాపలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జైనుల్‌పాషా, అబ్దుల్ మల్లిక్, అబ్రార్ అలీ, నిజాముద్దిన్, గౌస్, యూసుఫ్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు. అంతేకాక 30వ డివిజన్ పంపింగ్‌వెల్‌రోడ్‌లో పెద్దమ్మతల్లి దేవాలయం లైన్‌లో బాధితులకు శ్రీరక్ష ఆస్పత్రి అధినేత డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు సహకారంతో మంగళవారం భోజనాలతో పాటు దుప్పట్లు పంపిణీ చేశారు.మాజీ ఎమ్మెల్సీ,బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు డాక్టర్ జీవీఆర్, నంబూరి రామలింగేశ్వరావు, శ్యామ్ రాథోడ్, అల్లిక అంజయ్య, తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం కాల్వొడ్డులోని సమ్మక్క సారక్క ఆర్టీ వద్ద కాలనీవాసులకు శ్రీసాయి న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యాన బ్రెడ్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ మడుగు, వీరభద్రం, సురేష్, వీరబాబు, సిద్ధు అక్బర్, మధు తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మంవ్యవసాయం:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మినీ ట్రాలీ వర్కర్స్ యూనియన్ ఐఎన్‌టీయూసీ నాయకులు నున్నా మాధవరావు నాయకత్వంలో మున్నేరు వరద బాధిత కార్మిక కుటుంబాలకు 25 కిలోల బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాలీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కొత్త సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **ఖమ్మంగాంధీచౌక్:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ఆధ్వర్యాన మంగళవారం వరద బాధితులకు దుప్పట్లను పంపిణీ చేయగా.. బ్యాంక్ ఖమ్మం రీజనల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంత రెడ్డి, ఏజీఎంలు సర్వేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఆధ్వర్యాన నగరంలోని బొక్కలగడ్డ, మంచికంటినగర్, నయాబజార్ కాలేజీ వెనుక ప్రాంతం తదితర ప్రాంతాల్లో 500 కుటుంబాలకు 20 వేల లీటర్ల మంచినీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ జి.లింగస్వామి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ టి.శ్రామిక, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ షేక్ ఇబ్రహీం, రీజనల్ సెక్రటరీ ఆర్. శివకుమార్, ప్రతినిధులు కొల్లా రవీంద్ర, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

ఖమ్మం లీగల్: వరదలతో నష్టపోయిన న్యాయవాదులు, ప్రజలను ఆదుకోవాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఖమ్మం నగరంలో వరదల కారణంగా నిరాశ్రయులైన న్యాయవాదుల గృహాలను ఐఏఎల్ బృందం పరిశీలించి ఐఏఎల్ జిల్లా యూనిట్ తరపున రూ. 5వేల చొప్పున అందించారు. ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు పోట్ల మాధవరావు, ఐఏఎల్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావులతో పాటు అమరచంద్, నవీన్‌కుమార్, శరత్‌బాబు పాల్గొన్నారు.

మత్స్యకారులను..

ఖమ్మం మామిళ్లగూడెం: మత్స్యకారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొప్పెర జానకిరాములు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని సంఘ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు డాక్టర్ శీలం పాపారావులతో పాటు సైదులు, నాగేశ్వరరావు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నష్టపోయిన ప్రతీ కుటుంబానికి రూ.2లక్షల చొప్పున పరిహారం అందించాలని జనసేన పార్టీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నగర ఉపాధ్యక్షులు దేవేందర్, ఉత్తమ్ రాజు, శ్రవంత్‌కన్నా, డేవిడ్, నాగరాజు, గంగాధర్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పర్యటన..


దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన రాకాసితండా ప్రజలను, ఇతర ప్రాంత బాధితులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాకాసితండాలో ప్రజలను పరామర్శించి దుప్పట్లు పంపిణీ చేశారు. ఇళ్లు, పంటలు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన వారిని ప్రభుత్వం తగిన నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాస్‌రెడ్డి పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

6,957 ఎకరాల్లో పంటల నష్టం..

ఆకేరు, చెరువుల కుంటల వరదలతో దెబ్బతిన్న పంటలపై వ్యవసాయాధికారులు అంచనాలు సిద్ధం చేశారు. తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు, సుబ్లేడు, కాకరవాయి, పాతర్లపాడు, తెట్టెలపాడు, తిరుమలాయపాలెం, తాళ్ల చెరువు, పైనంపల్లి క్లస్టర్ల పరిధిలో 6,957 ఎకరాల్లో పత్తి, మిర్చి, వరి, పెసర పంటలు దెబ్బతిన్నాయి. అయితే రాకాసితండాలో ఇసుక మేటలు వేసి వ్యవసాయసాగుకి యోగ్యం కాకుండా దెబ్బతిన్న పంటలకు ఏ విధంగా పరిహారం చెల్లిస్తారనే స్పష్టత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.ప్రభుత్వం తమకు జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆదుకోవాల్సిన సమయమిది..



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: మునుపెన్నడూ లేని రీతిలో జిల్లాను వరదలు ముంచేత్తాయని, ఆదుకోవాల్సిన సమయంలో రాజకీయాలు తగవని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. ప్రజలను ఆదుకునేందుకు మాత్రమే ప్రాధాన్యతనివ్వాలని సంఘటితంగా పోరాడి కేంద్రం నుంచి నిధులు రాబట్టాలని ఆయన సూచించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంపునకు గురైన ప్రతీ కుటుంబానికి రూ.2 లక్షలు తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రస్తుత పరిస్థితిని జాతీయ విపత్తుగా గుర్తించి ఆర్థిక సాయం అందించాలని కోరారు.సునావత్ అశ్విని కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె. జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు రాకుండా చూడాలి


మంత్రికి చెక్కు అందిస్తున్న కార్పొరేటర్ విజయ

ఖమ్మంవన్‌టౌన్: వరద ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని 30, 31వ డివిజన్ బొక్కలగడ్డ, మోతీనగర్, 41వ డివిజన్ చెరువుబజార్ అంజనేయస్వామి దేవాలయం తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళీ, నాగండ్ల దీపక్‌చౌదరి, తుపాకుల యలగొండలస్వామి, బొమ్మ ఉదయ్, శివ,మంగ తదితరులున్నారు. ఈనేపథ్యాన స్థానిక 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ దంపతులు మున్నేరు వరద సహాయ నిధికి రూ.3 లక్షల చెక్కును మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందించారు.

అంతా కన్నీటి పలకరింపులే..

ఖమ్మంరాపర్తినగర్, ఖమ్మంవైద్యావిభాగం, ఖమ్మం క్రైం: ఆ ప్రాంతంలో ఎవరిని కదిలించినా కన్నీటి పలకరింపులే కనబడుతున్నాయి. ఏ ఇంటి వద్దకు వెళ్లి పలకరించినా తమ గోడును వినేవారే లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి నుంచే అధికారులు వస్తున్నారు కాని ఏం భరోసా ఇస్తారో ఇప్పటికి అర్థం కావడం లేదు. సర్వం కోల్పోయాం.. కోలుకోవడానికి ఎన్నేళ్లు పడుతుందోనని నగరంలోని బొక్కలగడ్డ ప్రాంతవాసులు వాపోతున్నారు.ప్రభుత్వం చూస్తే చాలీచాలని ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తారని అంటున్నారు. కనీసం ఇంట్లో తినే గిన్నెలను కొనుక్కోవడానికే వారిచ్చే డబ్బులు సరిపోవు.. ఇంట్లో వస్తువులను ఎలా కొనాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు పరీవాహక ప్రాంతవాసులను 'సాక్షి'కదలించగా వారి గోడు ఇలా తెలిపారు.

ముందే హెచ్చరిస్తే బాగుండేది..



గతంలో ఇలాంటి వరదలు వస్తున్నప్పుడు అధికారులు ముందస్తుగానే చేప్పేవారు. ఈ సారి చెప్పకపోవడం వల్లే భారీ నష్టం జరిగింది. ఇలాంటి వరదలను ఎప్పుడు చూడలేదు. మాకు సాయం చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలి. ఎంతో కష్టపడి ఇళ్లు కట్టుకున్నాం. అంతా ధ్వంసమైంది.

– ఎస్.సతీష్

ఖాళీ ఇళ్లు మాత్రమే మిగిలింది..



అకస్మాత్తుగా వచ్చిన వరదకు ఇళ్లు వదిలి వెళ్లాం. రెండు రోజుల తర్వాత వచ్చి చూస్తే ఖాళీ ఇళ్లు మాత్రమే మిగిలింది. ఇంట్లోని ఏ ఒక్క సామగ్రి మిగలలేదు. ఇవ్వాన్ని మళ్లీ కొనాలంటే ఎంత కాలం పడుతుందో. మాకు ప్రభుత్వం తగిన న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలి.

– వడ్డెబోయిన కృష్ణకుమారి

ఉద్యోగాలకు ఎంపిక

ఖమ్మం సహకారనగర్: పై ఇన్ఫోటిక్ కంపెనీ నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో తమ విద్యార్థులు 13 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించాక మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు, కంపెనీ బాధ్యులు విజయ్ జైస్వాల్, పియుష్ తివారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దోస్త్ స్పెషల్ డ్రైవ్

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) ద్వారా డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ద్వారా నమోదు చేసుకోవచ్చని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. రూ.400లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సెల్ఫ్ రిపోర్టింగ్ 11 నుంచి 13వ తేదీ వరకు ఉంటుందన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


నేలకొండపల్లి: కట్టుకాచారంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ప్రసాద్‌రెడ్డి

రఘునాథపాలెం/నేలకొండపల్లి/కూసుమంచి: వరద ప్రవాహంతో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయా మండలాల్లో అధికారులు, వివిధ పార్టీల నాయకులు పరిశీలించారు. ఈ క్రమంలో రఘునాథపాలెంలో ఖమ్మం డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి కొంగర వెంకటేశ్వర్లు, ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఈఓ శివకృష్ణలు కామంచికల్, దారేడు, పాపటపల్లి గ్రామాల్లోని పత్తి, మిరప, వరి పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించగా.. ఖమ్మం డివిజన్ హార్టికల్చర్ ఆఫీసర్ నగేష్, రైతులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలంలోని రామచంద్రాపురం, సుర్దేపల్లి, కట్టుకాచారం గ్రామాల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి వరద బాధితులను పరామర్శించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అలాగే, కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో వరద ప్రవాహానికి గల్లంతైన షేక్ యాఖుబ్, అతడి భార్య సైదాబీ మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించాక.. నర్సింహులగూడెం, పెరికసింగారం తదితర గ్రామాల్లో వరద నష్టాలను పరిశీలించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు. అంతేకాక కూసుమంచి మండలం పాలేరు ఏటి పరిధిలో దెబ్బతిన్న పంట పొలాలను బీజేపీ నాయకులు పరిశీలించి రైతులకు పూర్తిస్థాయి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుండా ఉపేందర్‌రెడ్డి, నాయకులు బద్దం వెంకటరెడ్డి,జువ్వాజి సురేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.